

## మృతుల కుటుంబాలను గౌతు శివాజీ పరామర్శ

**విశాలాంధ్ర-మందస:** మండలం బిడిమి, ఉగ్రానిపేట,అంబుగాం, బొడ్డులూరు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ కి చెందిన లబ్బ నారాయణ, డొక్కరి దానయ్య, మడియా లక్ష్మమ్మ,బొడ్డు నీలకంఠంలు ఇటీవల మృతి చెందడంతో గురువారం పలాస మాజీ శాసనసభ్యులు గౌతు శివాజీ ఆయా కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఆయనతో పాటు భావన దుర్యోధన,బమ్మిడి కర్రయ్య,కొనారి తులసీరావు,జుత్తు అమ్మినాయుడు,దున్న పురుషోత్తం,జోటియా హరికృష్ణ,బొడ్డు తిరుపతి, బత్తిన కృష్ణారావులు పాల్గొన్నారు.

## పక్కాగా.. లెక్కింపు

- శిక్షణ పూర్తి.. ఆచరణే తరువాయి
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** సాధారణ ఎన్నికలు 2024 ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లెక్కింపు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, ఈవిఎంలలో ఓట్ల లెక్కింపుపై ఒక్కరోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపులో ఆర్వో, ఏఆర్ఓలు, సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేసి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది లెక్కింపుకు సంబంధించిన హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదవి అవగాహన చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లో డిక్లరేషన్ పై సంతకం ఉన్నది లేనిది జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

ఆర్వో, అబ్జర్వర్ల పాత్ర కీలకం... లెక్కింపులో రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, ఆయా నియోజకవర్గ సంబంధిత రిటర్నింగ్ అధికారిదే పూర్తి బాధ్యత అని, తప్పక దానిని ఎంతో పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పనితీరు ఉండాలని, కౌంటింగ్ డేటా క్రోడీకరణ, ఎన్కోర్ యాప్ నందు అప్లోడ్ సక్రమంగా సకాలంలో చేయాలని అన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్వోలు నూరుల్ ఖమర్, భరత్ నాయక్, సి.హెచ్ రంగయ్య, లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డుమా పీడీ చిట్టి రాజు, ట్రైనర్లు కిరణ్, ఎన్.బాలాజీ, మెప్మా పిడి కిరణ్ కుమార్, శేష గిరి, అన్ని మండలాల తాసిల్దార్లు, 116 మంది వివిధ స్థాయిల సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు.

## ప్లాస్టిక్ నిషేధం ఉన్నట్టా.. లేనట్టా..?

- ఎక్కడ చూసినా దర్శనమిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- కాలుష్యం అవుతున్న పర్యావరణం

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి :** ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం కాలుష్యం తప్పదని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న మార్కెట్లో, హోటళ్లల్లో ప్లాస్టిక్ కవర్లలో నిత్యావసర సరుకుల నుండి కూరల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొనసాగు తూనే ఉంది. చెత్త కుప్పల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు చూస్తుంటే అసలు ప్లాస్టిక్ పై నిషేధ ఉన్నట్లా లేనట్లా అన్న అనుమానం కలుగుతుంది. వ్యర్థ ప్లాస్టిక్‌లో 10 శాతమే రీసైక్లింగ్ అవుతుంది. ఆహార ప్యాకింగ్లు, బాటిల్లు, వాటి మూతలు, స్ట్రాలు, ఆహార డబ్బాలు, పెన్నులు, టూత్ బ్రష్ లు ఇలా ఎన్నో రకాల ప్లాస్టిక్ వస్తువులను వాడడం వలన పర్యావరణానికి, మానవాళి ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారనుంది. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని వాటిని వినియోగించకూడదని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలంటూ గతంలో ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. నిషేధమంటూ దాడులు చేయడం మినహా పూర్తిస్థాయిలో అరికట్ట లేకపోతున్నారు. ఇప్పటికీ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల, ప్లాస్టిక్ కవర్లలో కూరలు నింపుతున్న వ్యక్తి వినియోగం కొనసాగుతూనే ఉంది. అక్కడక్కడ కొంత వినియోగం తగ్గిన అధికశాతం వినియోగి స్తున్నారు. చికెన్ దుకాణాల్లో, టీ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లలోనే టీ పార్సిల్ కొనసాగుతుంది. ఇప్పటికీ ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు పలు రకాల వస్తువులను ప్లాస్టిక్‌తో తయారుచేస్తూ విక్రయిస్తున్నారు, ప్రమాద కరమైన ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు ఉత్పత్తి వద్దే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు కనిపిస్తున్నాయి. నిషేధించేందుకు ఎంత ప్రయత్నించినా అది అమలు కావడం లేదనేది చెప్పకనే చెప్పవచ్చు. వివిధ అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్ళినప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం తప్పడం లేదు. ఆదివారం వస్తే పైన జూట్ బ్యాగ్, లోన ప్లాస్టిక్ కవర్లో మాంసం, చికెన ఇలా దుకాణాలలో విచ్చల విడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పట్టించుకునే వారే లేరని ప్రజల నుండి పెద్ద ఎత్తున వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో నిషేధం వైపుగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## వానా... వానా నువెక్కడా..!

- కనిపించని రుతుపవనాల జాడ
- తొలకరి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి:** వానా..వానా నువెక్కడా..? ఈ ప్రశ్న అందరి మదీని తొలుస్తోంది. మే నెలాఖరువు వచ్చిన దంచికొడుతున్న ఎండలతో ప్రజలు వేసవి తాపంతో అల్లాడిపోతున్నారు. ఉక్కపోతలను భరించలేక కరుణించవా ఓ వర్షమా! అంటూ వరుణదేవున్ని కోరుకుంటున్నారు. ఎప్పుడూ లేనంత ఉష్ణోగ్రతలతో ఈ ఏడాది వేసవిలో తారెత్తించి, ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఇప్పుడు వేసవి ముగిసినా.. వర్షం జాడే కనిపించడం లేదు. సహజంగా మే చివరి వారానికి ఎండలు ముగిసిపోతాయి. అయితే ఎండలు అయిపోయి వానలు దండిగా కురవాల్సిన ఈ సమయంలో తీవ్ర మైన ఎండలు, వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియక ప్రజలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఏటా మే చివరి వారంలో వర్షాలు సమృద్ధిగా పడుతుంటాయి. కానీ ఈ ఏడాది వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియక ప్రజలు ఎదురుచూపులు తప్పడం లేదు. రైతులు పొలాలు దున్ని పంటలు వేయాలో వద్దో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. కనీసం చిరుజల్లులైనా నేలను తాకితే.. దుక్కి దున్నవచ్చునుకునే రైతులకు నిరాశేమిగులుతోంది.

**వాతావరణ మార్పులు :** ఈ సంవత్సరం వాతావరణ మార్పులు తీవ్రంగా కనిపించాయి. లేకపోతే ప్రతిఏటా ఈ సమయానికి వర్షాలు ప్రారంభమై వస్తుండగా, ఈ సారి వెనుకడుగు వేయడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నారు. రుతుపవనాలు సముద్రం పైనే ఉంటూ.. దాదుగుమూతలు ఆడుతున్నాయి. ఈ కారణంగా కేరళ తీరాన్ని కూడా ఆలస్యంగా తాకినట్లు చెబుతున్నారు. ఆ నేపథ్యంలోనే ఈ నెల 23వ తేది వరకు వర్షాలు పడక పోవచ్చని వాతావరణశాఖ చెబుతోంది. ప్రస్తుతం అండమాన్ దీవులను దాటి బంగాళాఖాతంలో కొంత ముందుకు వచ్చినప్పటికీ, అక్కడే ఆగాయి. గత ఏడాది జూన్ 1న కేరళను తాకగా, ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది వర్షపాతం భారీగా తగ్గేఅవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడే కాదు, 1997, 98, 2003, 2015లో కూడా సరైన వర్షాలు లేక కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ లో అన్నదాతలకు కష్టాలు తప్పలేదు. ఈ సారి కూడా అలాగే ఉండే అవకాశం ఉంది.

**తొలకరి చినుకుల కోసం ఆశగా ఎదురుచూపులు :** మనదేశంలో ఏటా రుతుపవనాలు కేరళను తొలుత తాకి, ఆ తరువాత మిగిలిన రాష్ట్రాలను అనుగ్రహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇది ఒక ప్రకృతి ధర్మంగా మారింది. రైతున్నలు తొలకరి చినుకుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అయినా ఎక్కడా ఊరట లేదు. వడగాల్పులతో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటం గమనార్హం. గత పదేళ్లల్లో లేని అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ వేసవిలో నమోదు కావడం విశేషం. రెక్కాడితే కాని డొక్కాడని పేద ప్రజానీకం మండుటెండల్లో వేడి గాలుల్లో బతుకుతెరువు కోసం సతమతమవక తప్పడం లేదు. సాధారణ ఉష్ణోగ్రతలు కంటే 40 డిగ్రీలకు పైబడి 45 డి6గీలు దాటిన ఈ ఉష్ణోగ్రతలు వృద్ధులు, పిల్లల పాట్ల ప్రాణాంతకంగా పరిణమించాయి.

## ఏ-నెగిటివ్ రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడిన కార్పెంటర్

- అభినంధించిన రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** స్థానిక జెమ్స్ వైద్యాశాలలో డెలివరీ నిమిత్తం చికిత్స పొందుతున్న పి. కన్యాకుమారి వయసు ముప్పై బేబీ ఉమ్మనీరు త్రాగాటంతో అతి తక్కువ రక్త గ్రూప్ "ఎ" నెగెటివ్ రక్తం అవసరమవ్వటంతో నగరంలో దాతల సహాయం కోసం ఎదురు చూశారు. వేసవి దృష్ట్యా రక్త నిధిలలో రక్తం దొరకకపోవటంతో రెడ్ క్రాస్ ప్రతినిధి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్ ను సంప్రదించగా, రెడ్ క్రాస్ సభ్యులు బి. సతీష్ సహకారంతో శ్రీకాకుళం ధర్మవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ పోతయ్యను దాతగా కోరగా స్పందించిన ఆయన రెడ్ క్రాస్ చైర్మన్ జగన్ మోహన్ ఆధ్వర్యంలో "ఎ" నెగెటివ్ రక్తాన్ని అందించి కన్యాకుమారికి అండగా నిలిచారు. పోతయ్య మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకూ రక్తాన్ని చిందించటానికి సిద్ధమన్నారు. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ కార్పెంటర్ గా తన విధులను నిర్వర్తిస్తూ సామాజిక బాధ్యతతో ముందుకు రావటం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా పోతయ్యను, ఇందుకు సహకరించిన సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు గిరిజాలా మహాలక్ష్మి, పొడుగు. చరణ్, రెడ్ క్రాస్ ప్రతినిధులను రెడ్ క్రాస్ మేనేజర్ బి. సతీష్ అభినందనలు తెలిపి వీరిని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం రెడ్ క్రాస్ ప్రతినిధులు ఆధ్వర్యంలో రక్త నిల్వను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు ఉర్లం. శివతేజ, రెడ్ క్రాస్ ప్రతినిధులు జి. పవన్ కుమార్, నంది ఉమా శంకర్, అయేషా బేగం, సుజాత, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక టీబీతో బాధపడుతున్న చిన్నారి

- దాతలు కోసం ఏదురుచూపులు
- ఆక్సిజన్ కాంసెంట్రేటర్ లేకపోతే చిన్నారి ప్రాణం నిలవదు
- రిమ్స్ స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం:** స్థానిక జెండాల వీధికి చెందిన సుహాసినీ నిరుపేద కుటుంబానికి చెందిన వారు కాగా, భర్త లేరు, ఇద్దరు కుమార్తెలు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం నెట్టుకొస్తున్నారు. పెద్ద కుమార్తే చదువుల సరస్వతి యశోద ప్రభుత్వ జూనియర్ కళాశాల శ్రీకాకుళంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివింది. విధి నాటకంలో భాగంగా టీబికి గురై గత సంవత్సర కాలంగా చదువుకు దూరమై, అధిక టీబితో అనారోగ్యం పాలయింది. గతంలో ఈ కుటుంబానికి పత్రికా ప్రతినిధి జగదీశ్, తన మిత్రులు యోగేష్ ల ద్వారా వీరి దీన స్థితిని తెలుసుకున్న సామాజిక సేవకులు ఉర్లం. శివతేజ, నాల్గవ తరగతి చదువుతున్న సామాజిక సేవకురాలు చిన్నారి ట్వింకిల్ సహాయంతో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్ మోహన్ రావు, యశోదమ్మ ఫౌండేషన్ మాదారపు దేవిడ్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి శిల్లా రమేష్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి. మణికంఠ రావు, జీల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజా రౌతు, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ తమ సహాయాన్ని వివిధ రూపాలలో అందించి ఆదుకున్నారు. ఈ రోజు యశోద చావు, బ్రతుకుల మధ్య పోరాటం చేస్తుందని రిమ్స్ ప్రభుత్వ వైద్యాశాలలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి ఆవేదన చెందారు. గతంలో వీరికి సహాయం చేసిన ప్రతీ ఒక్కరికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఆక్సిజన్ కాంసెంట్రేటర్ కు సుమారు ఎనభై వేలు వరకు ఖర్చువుతుందని ఇందుకు సామాజిక సేవకులు శివతేజ అందించిన సమాచారంతో మదారపు దేవిడ్ మిత్ర బృందం, యోగేష్ మిత్ర బృందం ముప్పై వేల వరకు సహకరించారని, దాతలు ముందుకు వచ్చి ఈ చిన్నారి ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ కుటుంబం దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రభుత్వ వైద్యాశాల స్టాఫ్ నర్స్ సిస్టర్ గిరిజాలా మహాలక్ష్మి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 14 మద్యం సీసాలు స్వాధీనం

**విశాలాంధ్ర-పొందూరు :** పొందూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 14 మద్యం సీసాలను ఎస్ఈబీ స్టేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ డి. గంగాధరం ఆదేశాలమేరకు గురువారం జి. సిగడాం పరిధి గదబపాలెం వద్ద ఎస్ ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి వై. గణపతిని అదుపులోకి తీసుకుని 14 సీసాలను స్వాధీనం చేసుకుని గణపతిపై కేసు నమోదు చేస్తారు.

## ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

**విశాలాంధ్ర-సంతబొమ్మాలి...** ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని బోరుభద్ర సర్పంచ్ ప్రతినిధి, ఎంపీటీసీ ప్రతినిధి బుసకల లక్ష్మయ్య లక్ష్మీకాంతం, చింతాడ జయ చెన్నారావు అన్నారు. బోరుభద్ర ఎంపీ యూపీ పాఠశాలలో గురువారం ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ లకినేని సంధ్యారాణి తో పాటు వచ్చిన వైద్యాధికారులు ఫిజియోథెరపీలో అత్యంత అనుభవనీయులని అన్నారు. అనంతరం వచ్చిన రోగులకు వైద్యులు ఉచితంగా తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైద్యులు, స్థానిక రోగులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమాచార్య జయంతి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** తాళ్లపాక అన్నమాచార్య 616 వ జయంతి పురస్కరించుకుని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం లో అన్నమాచార్య జయంతి ఉత్సవం శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ మండ శ్రీనివాసరావు ట్రస్టీలు వెంకట రమణ మూర్తి, గణేశ్వర రావు, రెడ్డి సత్యనారాయణ, దొర దొర లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ సంగీత సంస్థలకి చెందిన కళాకారులు, స్థానిక కళాకారులు అన్నమాచార్య కీర్తనలు గానం చేసి, ప్రేక్షకులను అలరించారు. వీరికి హార్మోనియంపై రెడ్డి సత్యనారాయణ, వయొలిన్ పై ధనుంజయ రెడ్డి, మృదంగం పై శ్రీనివాసరావు, వినోద్, సాయి చరణ్ లు సహకరించారు. మొదట ఉత్సవం టి.కొండల రావు, శాక్సఫోన్ వాయిద్యంతో నాద నీరాజనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.పవన్‌కుమార్, వెంకటేశ్వరి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈలో ఎన్ఈఆర్ ఎక్సలెన్స్ విద్యార్థి ప్రతిభ

**విశాలాంధ్ర-రణస్థలం:** ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థి ఉత్తరాంధ్రలో 10వ తరగతి సీబీఎస్ఈ బోర్డ్ పరీక్షల్లో 92శాతం విద్యార్థిని ఎల్. యువ కీర్తి మార్కులు సాధించింది. కీర్తిను స్కూల్ డైరెక్టర్ తేజ అభినందించారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే

**విశాలాంధ్ర-కవిటి:** మండలంలో గల కళింగపట్నం, కుసుంపురం, చిన్న బల్లిపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ తదితర గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం సమగ్ర శిక్ష ద్వారా చేపడుతున్న 0 నుండి 18 సంవత్సరాల వయసుగల ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వేలో భాగంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి గోవిందరావు కవిటి మండలం విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి పర్యవేక్షణలో కవిటి మండలంలో సహిత విద్య ఉపాధ్యాయులు లమ్మత కృష్ణారావు, అరుణ్ కుమార్ సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు 18 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు జరగనుందని తెలిపారు.

## గోకర్లపల్లి ఎన్నికల వివాదంలో 28 మంది అరెస్టు

**విశాలాంధ్ర-పొందూరు:** మండలం గోకర్ణపల్లి గ్రామంలో ఈ నెల 13న ఎన్నికల సమయంలో జరిగిన కొట్లాటకు సంభందించి 28 మందిని అరెస్టుచేసి రిమాండ్కు తరలించినట్లు స్థానిక ఎస్సై రవికుమార్ తెలిపారు. గోకర్ణపల్లిలో జరిగిన కొట్లాటలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని శ్రీకాకుళం రిమ్స్ తరలించారు దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు బుధ, గురువారాలలో 28 మందిని అరెస్టుచేసే శ్రీకాకుళం కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించినట్లు తెలి పారు..

## ఆధ్యాత్మిక స్ఫూర్తి ప్రదాతకు ఘన సత్కారం

**విశాలాంధ్ర-పొందూరు :** ఆధ్యాత్మిక పరిడవెల్లే పొందూరులో ఉన్న అనేక దేవాలయాలకు తనదైన శైలిలో దైవసేవ స్ఫూర్తి ప్రదాతగా గుర్తింపు పొందిన కాళ్ల గోవిందకు స్థానిక శ్రీకంచికామాక్షి ఏకాంబరేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ ఆలయం ఆవరణలో తాగునీటి గొట్టపు బావి, విద్యుత్ మోటారు,పైపు లైన్ నిర్మాణానికి రూ.82వేల మొత్తాన్ని ఈ సందర్భంగా గోవింద అందజేశారు. ఇంకా స్థానికంగా ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయానికి హుండీతో పాటు భక్తులకు వేసవి తాపాన్ని నుండి సహకరించాలన్న సదుద్దేశంతో కూల్ వాటర్ ట్యాంక్ను ఆయన బహూకరించారు. స్థానిక అయ్యప్ప స్వామి వారి ఆలయానికి కూల్ వాటర్ ట్యాంకుతో పాటు ఆలయ నిర్మాణానికి అవసరమైన సిమ్మెంటును అందించారు. స్థానిక మహారాజా మార్కెట్ ఆవరణలలో వెలసి ఉన్నకోదండ రామస్వామి పురాతన ఆలయానికి బహు సుందరంగా తయారు చేసే దశగాభారీ ఎత్తున రంగులు వేయించే కార్యక్రమం చేపట్టారు.స్థానిక చెల్లూరు వారి వీధిలో వెలసి ఉన్నజగత్ జననీ లోక విక్షేతమాతగా ఇక్కడ ప్రజలను ఆదరిస్తున్న తోర్లేటి పైడితల్లి అమ్మవారి ఆలయానికి హుండీని అందజేశారు. ఎర్ర వారి తోటలోవెలసి ఉన్న శివాలయానికి హుండిని సమర్పించిన ఆధ్యాత్మిక సేవకుడు కాళ్ళ గోవిందకు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు.

## పాతపట్నం టీడీపీలో క్రాస్ ఓటింగ్...?

**ఎంపీ అభ్యర్థి కింజరాపు కన్నా ఎంఎల్ఏ అభ్యర్థి మామిడికి తక్కువ ఓట్లు..?**

**విశాలాంధ్ర-కొత్తూరు :** పాతపట్నం నియోజికవర్గంలో టీడీపీకి ఓట్లు వేసేవారు కొందరు క్రాస్ ఓటింగ్ చేసి వేరే పార్టీకి వేసారా? అంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇలా క్రాస్‌గా కొందరు ఓట్లు వేసినట్లు చర్చ సాగోతుంది. ఎవరైనా ఒక ఓటరు ఒక పార్టీ ఎంపీ అభ్యర్థి కి ఓక ఓటు వేసి తన రెండవ ఓటును వేరే పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి కి వేస్తే దాన్నే క్రాస్ ఓటింగ్ అంటారు అది ఓటరు స్వచ్ఛ దాన్ని ఎవరూ తప్పు పట్టకూడదు. సాధారణంగా పార్టీ లను అనుసరించి ఎంపీ.ఎంఎల్ఏ పదవులకు ఒక సారి ఏన్నికలు జరిగినప్పుడు మాత్రమే ఈ క్రాస్ ఓటింగ్ కి ఆవకాశం ఉంటంది. ఇపుడు పాతపట్నం నీయోజికవర్గంలో టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావుకు ఆ పార్టీ టికెట్ రావడాన్ని ఇష్ట పడని కొందరు గ్రామస్థాయి నాయకులు తమ ఒక ఓటును టిడిపి ఎంపీ అభ్యర్థి. కింజరాపుకు వేసి రెండవ ఓటును వేరే వారికి వేసినట్లు అక్కడక్కడా చర్చ సాగుతోంది ఎన్నికలు జరిగిన తరువత పాతపట్నం నియోజకవర్గం వైసిపి కన్నా టీడీపీకే సానుకూల పరిస్థితులున్నట్లు కనిపించింది? అయితే గత రెండు మూడు రోజులు నుండి టీడీపీ, ఎంపీ, ఎంఎల్ఏ అభ్యర్థులకు ఓట్లు వేసిన వారు కొందరు క్రాస్ ఓటింగ్ చేశారన్న సమాచారంపై చర్చ నడుస్తోంది. అసలే పాతపట్నం నియోజికవర్గంలో వైసిపి, టీడీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ సాగింది. ఈ పరిస్థితుల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థికి ఓటువేసిన కొందరు. అదే పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థికి కాకుండా తమ రెండవ ఓటును వేరే అభ్యర్థికి వేసారన్న అనుమానాలు ఎంత వరకు వాస్తవం. అలా అయితే, ఈ క్రాస్ ఓటింగ్? అభ్యర్థుల గెలుపోటములపై ఎంతవరకు ప్రభావం చూపు తాయో వేచి చూడాలి.

## మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-హిరమండలం:** డ్రైనేజీలో పడి మద్యం మత్తులో ఉన్న వ్యక్తి మృతి చెందాడు. హిరమండలం పంచాయతీ లోని చిన్నకోరాడ వీధికి శివారున ఈ సంఘటన గురువారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జి.నారాయణస్వామి తెలిపిన వివరాలు ప్రకారం హిరమండలంలోని మేదరవీధికి చెందిన మృతుడు తెల్లి మల్లేశ్వరరావు(44) హిరమండలంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ఓహోటల్‌లో మృతుడు పనిచేస్తుండేవాడని. బుధవారం రాత్రి చిన్న కోరాడ వీధి కి శివారున ఖానా మీద మద్యం మత్తులో ఉండి వెనుక కు తూలడం తో డ్రైనేజీలో పడిపోయాడు. ముఖము బురద నీటిలో మునగడం వలన ఊపి రాడక చనిపోయి ఉంటాడని ఎస్సై తెలిపారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు కలరని వీళ్ళు ప్రస్తుతం అయోధ్య యాత్రలో ఉన్నారని, మృతుని సోదరుడు తెల్లి రమణ పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ

**విశాలాంధ్ర-రణస్థలం :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యం ఉంటారని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని రణస్థలం సర్పంచ్ మరియు రాష్ట్ర సర్పంచ్ ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట బానోజి నాయుడు అన్నారు. గురువారం మండలం రణస్థలం పంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ పుణ్యమా అని పంచాయతీ ఖాజానాలో ఒక్క రూపాయి లేకుండా చేశారని అయినప్పటికీ తనున నమ్మి ఓటు వేసిన ప్రజల ఆరోగ్యం కోసం స్వంత నిధులు వెచ్చించి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం రణస్థలం పంచాయతీలోని నగరపాలేంలో ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన హుటాహుటిన అక్కడి మంచినీటి బోరును రిపేరు చేయించి అక్కడి ప్రజలకు నీటిని అందించి వారి మన్ననలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయానికి 'పద్మావతి' విధ్యార్థులు ఎంపిక

**విశాలాంధ్ర-నరసన్నపేట:** స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విధ్యార్థులు పుట్టపర్తిలో వున్న శ్రీ సత్యసాయి విశ్వ విద్యాలయంలో హానర్స్ డిగ్రీ కోర్సులకు ఎంపికయ్యారని కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సైన్స్ హానర్ డిగ్రీకు సుగ్గు నితిన్ ఎంపిక కాగా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హానర్స్ డిగ్రీకు వంజరాపు సాయికుమార్ ఎంపిక అయ్యారని అన్నారు. భోదన, వసతి, వైద్య సదుపాయాలు ఈ విశ్వ విద్యాలయంలో పూర్తిగా అందించటమే కాక విధ్యార్థుల్లో ఆధ్యాత్మికత పెరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. వ్రాత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికైన విధ్యార్థులను కళాశాల ఛైర్మన్, పల్లి సూరిబాబు, అధ్యాపకులు అభినందనలు తెలియచేశారు.

## కృష్ణాపురంలో వడదెబ్బతో ఉపాదికూలీ మృతి

**విశాలాంధ్ర-పొందూరు:** మండలం కృష్ణాపురం గ్రామంలో వడదెబ్బతో ఉపాదిహామీ కూలీ మృతిచెందిన ఘటన బుదవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గార కిత్తయ్య (65) బుధవారం గ్రామ సమీపంలోగల చెరువులో జరుగుతున్న ఉపాదిపనులకు హాజరయ్యాడు. పనిచేస్తున్న సమయంలో వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి కార్మికులు సహాయంతో కిత్తయ్యను ఇంటికి తీసుకువచ్చిన కుటుంబసభ్యులు ప్రాధమిక చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో మృతిచెందాడు. నిరుపేత కుటుంబానికి చెందిన కిత్తయ్య మృతిచెందడంతో కిత్తయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామసర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు కోరారు.

## గ్రంథాలయంలో అన్నమాచార్య జయంతి ఉత్సవం

**విశాలాంధ్ర-అరసవల్లి:** శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 616 వ జయంతి పురస్కరించుకుని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం లో అన్నమాచార్య జయంతి ఉత్సవం శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ మరియు శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. ట్రస్ట్ చైర్మన్ మండ శ్రీనివాసరావు ట్రస్టీలు వెంకట రమణ మూర్తి, గణేశ్వర రావు, రెడ్డి సత్యనారాయణ దొర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ సంగీత సంస్థలు కి చెందిన కళాకారులు మరియు స్థానిక కళాకారులు అన్నమాచార్య కీర్తనలు గానం చేసి, ప్రేక్షకులను అలరించారు. వీరికి హార్మోనియం పై రెడ్డి సత్యనారాయణ, వాయులీనం పై ధనుంజయ రెడ్డి, మృదంగం పై శ్రీనివాసరావు, వినోద్ మరియు సాయి చరణ్ లు సహకరించారు. మొదట ఉత్సవం టి. కొండలరావు, శాక్సఫోన్ వాయిద్యం తో నాద నీరాజనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో జి. పవన్ కుమార్, వెంకటేశ్వరి, శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాలి: సంతబొమ్మాలి, నౌపడ శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఇండోర్ ఆటలు గ్రంథాలయ అధికారి కే రామకృష్ణ ఆధ్వర్యంలో ఆడించారు. అలాగే నౌపడ శాఖ గ్రంథాలయంలో శాఖ గ్రంథాలయ అధికారిని బి.రూపావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రంథాలయాల సహాయకులు, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటంలో ప్రాణాలను బలిదానం చేసిన అమరులను స్మరిద్దాం

### 27న బొడ్డపాడులో సభను జయప్రదం చేయండి..!

విశాలాంధ్ర-పలాస: వీరోచిత నక్సల్బరీ శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను బలిదానం చేసిన అమరవీరులను స్మరించుకుందామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు అన్నారు. గురువారం ఈ నెల 27న బొడ్డపాడులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ స్మారక కమిటీ సభ్యులతో కలిసి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 మే 27న బూటకపు ఎన్ కౌంటర్‌లో అమరత్వం చెందిన కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తితో పాటు నిరంజన్, చినబాబు, శృంగవరపు నరసింహులు, గోపాల్‌రావు, పాపారావు, రామచంద్ర ప్రధాన్‌ల పోరాట స్ఫూర్తితో ప్రజల ప్రయోజనాలకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. మన దేశానికి అధికార మార్పిడి జరిగిన తర్వాత తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశించిన ప్రజలు గత 77 యేళ్ళుగా భంగపడుతూనే ఉన్నారన్నారు. దేశంలో పేదరికం, కరువు కాటకాలు వ్యాపించడం, భూమి కొద్ది మంది భూస్వాముల చేతుల్లో ఉండడం, దానికి పాలకుల అధికారం దన్నుగా ఉండటంతో నక్సల్బరీ, శ్రీకాకుళ గిరిజన రైతాంగం ఆ అధికారానికి ఎదురుతిరిగిందని గుర్తు చేశారు. భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం వెలుగులో నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటాలు ముందుకు వచ్చాయని అన్నారు. ఆ పోరాటంలో భాగంగానే 1969లో శ్రీకాకుళం జిల్లాలో నియంత పాలకులు సాగించిన తొలి పోలీసు బూటకపు ఎన్ కౌంటర్లో కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తి తో పాటుగా మరో ఆరుగురు అమరత్వం చెందారన్నారు. ఈ హత్యాకాండలో సుమారు 350మందికి పైగా తమ విలువైన ప్రాణాలను కోల్పోయారని, ఈ మానవ సంహారంలో ప్రాణాలను తృణప్రాయంగా బలి యిచ్చిన అమరులందరికీ వినమ్రంగా నివాళులర్పిస్తున్నామన్నారు. గతంలో విప్లవ సంస్థలన్నింటిని కలుపుకొని బొడ్డపాడులో మే 27న అమరుల సంస్మరణ సభ ఉమ్మడిగా నిర్వహించడం జరిగేదని,వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన విప్లవకారులకు ఈ సంస్కృతి స్ఫూర్తిదాయకంగా ఉండేదన్నారు. అటువంటి వాతావరణాన్ని ఏ ప్రలోభాలకు లోబడి ఇలా నాశనం చేయడం వెనుక దాగివున్న కారణాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని విధ్వంసం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, మతవిద్వేషాలు రెచ్చగొట్టే బిజెపి పార్టీతో జత కూడిన ప్రాంతీయ పార్టీ శక్తులతో కలిసి నేడు ఈ అమరుల సంస్మరణ సభను జరపడానికి కొందరు పూనుకోవడం అమరవీరులను గౌరవించడమా? అవమానించడమా? అన్నది ప్రజలే నిరూపణ చేస్తారని, ప్రజలే నిజ వీరులు.ప్రజలే నిర్మాతలు... ఆలోచన చేయమని కోరుతున్నామన్నారు. దీర్ఘకాలిక విప్లవ పోరాట మార్గం కఠినతరమైనది, కానీ జీవించాలంటే పోరాడక తప్పదు. నేడు దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగి, ఫలితాలు తరువాత ఎవరు ఏ పాలక వర్గాలు పాలనా పగ్గాలను చేపడతారనే నిర్ణయం జూన్ 4వ తేదీన వెలువడుతుంది. పాలకులెవరైనా ప్రజల ఆకాంక్షను నెరవేర్చేవైపు తమ ఆలోచన చేయకుండా కార్పొరేట్ దోపిడీ మూక ప్రయోజనాలనే వారు కాపాడటానికి సిద్ధపడతారన్నారు. దేశానికి అమరులు చూపిన విప్లవ సాయుధ పోరాట మార్గమే విముక్తి చేస్తుందన్న ఆశయంతో కామ్రేడ్ పంచాదితో సహా ఏడుగురు విప్లవ యెదుల పోరాట మార్గమే మనందరి మార్గమని, అదే ఈ దేశానికి దిశా, నిర్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ,గొరకల బాలకృష్ణ, సాంబశివరావు, సుందరమ్మ, అప్పయ్య, కామేశ్వరరావు, అప్పారావు,, నారాయణ, కైలాస్, జగదీశ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అమరవీరుల స్మారక కమిటీ అధ్వర్యంలో విశాలమైన ప్రాతిపదికన, కలిసి వచ్చిన అన్ని శక్తులను కలుపుకోవాలని పిలుపునిచ్చారు. మే 27న 5 గంటలకు జరుగుతున్న అమరవీరుల స్మారక సభకు ప్రజాస్వామిక వాదులు మేధావులు, యువకులు, మహిళలు, విద్యార్థిని విద్యార్థులు అందురూ పాల్గొని, ర్యాలీని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కాయ్ రాజా కాయ్...!

### "గెలుపు గుర్రాలు"పై.. కామ్ సీక్రెట్ బెట్టింగ్స్

వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం

టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్

ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ

విశాలాంధ్ర-పొందూరు: ఆమదాల వలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయాలపై చిక్కోలు జిల్లాలోనే కాకుండా, రాష్ట్ర రాజకీయాలు ఆశక్తికరంగా ఎదురు చూస్తున్నాయి. రాజకీయ ఉద్దండుడూ శాసన సభాపతి తమ్మినేని సీతారాం వైసిపి పార్టీ అభ్యర్థిగా పోటీ చేయగా, స్పీకర్ తమ్మినేని సొంత మేనల్లుడు టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ పోటీ చేయడం పట్ల ఇక్కడ గెలుపు ఓటములను ప్రజలు ఆశక్తికరంగా చూస్తున్నారు. డి అంటూ" డి"కొట్టే రీతిలో అభ్యర్థులే కాకుండా వైసీపీ- టీడీపీ కార్యకర్తలు కూడా గెలుపు మాదంటే మాది" కాయ్ రాజా కాయ్" అంటూ సీక్రెట్ బెట్టింగులకు ముందుకెళ్తున్నారు. నియోజవర్గంలో ఎక్కడ చూసినా సీక్రెట్ బెట్టింగుల కోసం ఒకవైపు గ్రామాల్లో సర్వేలు చేస్తుండగానే? మరోవైపు ఒకరి పై ఒకరు గెలుపు సవాల్ చేస్తున్నారు. తమ్మినేని -కూన ఓట్లలో ఎవరి ఓటు శాతం ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ కాజేస్తాడో ముమ్మరంగా ఇక్కడి అంచనాలు వేస్తున్నారు. వైసీపీ పదకాల ప్రభంజనంతో తమ్మినేని గెలుపు తద్యమని ఒక వర్గం బెట్టింగులకు వెళ్లగా, కూన అనుచరులు కూటమి పొత్తులతో పాటు గతంలో విప్ గా పనిచేసే సమయంలో చేసే అభివృద్ధి కార్యక్రమాలు టిడిపి విజయానికి సోపానాలు అవుతాయని ఇక్కడ ప్రజలు దీమా వ్యక్తం చేస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ సహితం గెలుపు తమదేనంటూ చెప్పుకో స్తున్నారు. ఆమదాల వలస నియోజక వర్గంలో ఒకే కుటుం బంలో వైసిపి -టిడిపి అభ్యర్థులు పోటీ పడడం ఇదోక ఏత్తుగథ, డ్రామా రాజకీయమని ప్రజలకు సువ్వారి అప్పుడే విడమర్చి చెప్పిన విషయాలు కారణంగాప్రజలు తన వైపు మొగ్గుచూపడం వల్లే తనకు గెలుపు ఖాయమని సువ్వారి ధీమా వ్యక్తంచేయగా,మరోవైపు గాంధీ అనుచరులు ఎన్నికల రోజునే సుమారు ఉదయం ఏడు గంటలకు ఓటు వేస్తే గ్యాస్ స్టౌవ్ కు వేయండి లేదంటే సైకిల్ గుర్తుకు ఓటేయ్యండి అంటూ ఓటర్లకు పిలుపునివ్వడంతో ఓటర్లు ఓటేసేటప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అభ్యర్థుల కన్నా ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు కంటికి రెప్పలేకుండా జూన్ 4వ తేదీ వరకు ఎదురుచూపులు చూస్తున్నారు. అభ్యర్థులు గెలుపు వాటములు ఎలా ఉన్నా ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు,అభిమానులు వాడవాడల్లో, మహారాజా మార్కెట్ ప్రాంగణంలోనూ, కిల్లి బడ్డీలు, టీ షాపుల్లో ఒకటే చర్చల్లో మునిగి తేలి ఉన్నారు. కొన్ని సందర్భాల్లో ఇరువర్గాల అంచనాల్లో భాగంగా ఎటువంటి తగాదాలు వాటిల్లుతాయో అన్న భయం గ్రామాల్లో వెంటాడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే గ్రామా ల్లోని యువకులు ఎప్పుడు ఏ తగాదా తెచ్చి పెడతారో నన్ను భయం ఆ ఇంటి యజమానులకు తలనొప్పి తెచ్చి పెట్టింది. ఓట్ల లెక్కింపుకు రోజులు దగ్గర పడుతుండడంతో యువకులు, రాజకీయ నేతలు ఉత్కంఠతరోజు రోజుకు పెరుగుతుంది.ఎవరికి వారే గెలుపుపై దీమా వ్యక్తం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఓట్ల శాతం భారీగా పెరగడం తమకే మేలు జరుగుతుందని టిడిపి దీమా వ్యక్తం చేస్తుండగా, జగనన్న పథకాలు భారీ ఎత్తున ఇంటింటికి చేరడంతో సర్కారు రుణం తీర్చుకోవడానికి స్వచ్ఛందంగా ఓటర్లు పోలింగ్లో పాల్గొనడం వల్ల వైసీపీకి విజయాలు కనిపిస్తున్నాయనివైసీపీ ధీమా వ్యక్తం చేస్తుంది. ఓటింగ్ శాతం పెరగడం తమకే మేలు జరుగుతుందని ఇరు పార్టీలు లెక్కల వేసుకుంటున్నారు. టిడిపికి గెలిచే సీను లేదంటూ వైసిపి విమర్శలు గుప్పిస్తుండగా, ఈ ఎన్నికలతో వైసిపి ఏపీ ని ఖాళీ చేయవలసిందే నంటూ టిడిపి ఘంటపదంగా చెబుతున్నారు.రాష్ట్రంలో కూటమి సత్తా చూపిస్తామనివైసీపీకి సవాల్ విసురుతుండగా,రాష్ట్రంలో కూటమికి కోకటి వేళ్ళతో పికెందుకు సర్కారు పథకాలేచాలంటూ దీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత వల్లే ఫోలింగు కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారని టిడిపి ప్రచారాలు చేస్తుండగా, జగన్ సర్కారు పథకాలు లబ్ధి పొందిన ఓటర్లు కదం తొక్కి కదలి రావడంతో ఓటింగ్ శాతం పెరిగే తీరే జగనన్న గెలుపుకు సోపానాలని వైసీపీ నేతలు దీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులు వ్యూహ పతివ్యూహాలతో గెలుపు కోసం వన్నాగాలు ఎన్ని పన్నుతున్నా? అంతు చిక్కని ఓటర్ల నాడీతోప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. క్రాస్ ఓటింగ్ పై ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టిస్తున్నా బైట మేకపోతు గాంబీర్యాన్నీ చూపిస్తూ లో లోపల గుండెజారి గల్లంతౌతామేమో నన్న భయంవెంటాడుతుంది. ఇటువంటి సమయంలో కార్యకర్తలు ఉత్సాహంగా సీక్రెట్ బెట్టింగులు పాల్గొనడం చూసి ప్రత్యర్థులందరిలో ధైర్యాన్ని ఉత్సాహాన్ని నింపినా జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపులో విజయరథుడేవరో తేట తెల్లం కాబోతుంది. అంతవరకు ప్రజలు, రాజకీయ వేత్తలు శాంతి, స్నేహ, సంఘీభావంతో మెలగాలని అభ్యుదయ, మేధావి వర్గాలు చెబుతున్నారు.

# హుదూద్ ఇళ్ళకు మోక్షమెప్పుడు?

విశాలాంధ్ర-పలాస: సొమ్మొకరిది.. సోకొకరిది.. అన్న చందంగా పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం సూదికొండ వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న 192 హుదూద్ ఇళ్ల పరిస్థితి తయారైంది. అప్పటి టీడీపీ పాలనలో పట్టిన రాజకీయ గ్రహణం నేటికీ వీడలేదు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మాణాలు ప్రారంభించిన హుదూద్ ఇళ్లు పూర్తయినా లబ్ధిదారుల చేతికి చేరలేదు. 2015లో వచ్చిన హుదూద్ తుపానుకు విశాఖ అతలా కుతలం కాగా జిల్లాలో అంతగా నష్టం జరగకపోయినా అప్పటి రాష్ట్ర టీడీపీ ప్రభుత్వం స్పందించి జిల్లాకు హుదూద్ ఇళ్ళను మంజూరు చేసింది. అందులో భాగంగా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం సూదికొండ వద్ద, వజ్రపుకొత్తూరు మండలం బెండి కొండ వద్ద ఒక్కొక్క ఇంటి విలువ రూ.4 లక్షలతో 9.216 కోట్ల రూపాయల నిధులతో ఎన్టీఆర్ ప్రత్యేక పట్టణ గృహనిర్మాణ పథకం ద్వారా ఇళ్ళను నిర్మించేందుకు 2016 ఆగస్టు 27న అప్పటి రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి, ప్రస్తుతం టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. హుదూద్ ఇళ్ళ నిర్మాణం పనులు శరవేగంగా జరిగి పూర్తి అయ్యాయి. అయితే నిర్మాణ దశకు ముందు హౌసింగ్ అధికారులు అర్హులైన వారి జాబితాను తయారు చేసి వారి నుండి కొంత మొత్తం డిపాజిట్ రూపంలో ప్రభుత్వానికి జమ చేయాలనే నిబంధన ఉండగా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో హుదూద్ ఇళ్లకు సంబంధించి విడుదల చేసిన జాబితాలో 192 మందికి గాను కేవలం 42 మందే అర్హులుండటం, దీనిని పత్రికలు బట్టబయలు చేయడం అప్పట్లో సంచలనం రేపింది. పత్రికలలో వచ్చిన కథనాలపై అప్పటి పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ స్పందిస్తూ మొదట విడుదలైన జాబితాలో కేవలం అర్హులనే గుర్తించి అనర్హులను తొలగించాలని అప్పుడే తుది జాబితా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఆ జాబితాలో కూడా అనర్హులుంటే తమకు గానీ, జిల్లా కలెక్టరుకు గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే మాజీ ఎమ్మెల్యే శివాజీ ఆదేశాలు మేరకు ఇటు రెవిన్యూ అటు మున్సిపల్ సిబ్బంది జంట పట్టణాలలో సర్వే నిర్వహించి తుది నివేదిక అందజేసినా అప్పట్లో హుదూద్ ఇళ్ళ జాబితా విడుదల చేయకపోవడంతో అర్హులైన నిరుపేదలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో 2019 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని తెలియడంతో ఆదరా బాదరాగా అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ లబ్ధిదారుల జాబితా లేకుండానే అట్టహాసంగా హుదూద్ ఇళ్లను ప్రారంభించారు. తరువాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలవ్వడం వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డంతో మళ్లీ హుదూద్ ఇళ్ల పంపిణీ తెరపైకి వచ్చింది. రాజు మారిపోవడం, పరిపాలన మారిపోవడంతో తమకు న్యాయం జరగదేమోనని, గతంలో అర్హులైన 62 మంది ఇళ్లు లేని నిరుపేదలకు ప్రస్తుతం ఇళ్లు మంజూరవు అవుతాయో లేదో అని ఆందోళనగా ఎదురు చూసారు.అయినా వారి కోరిక నేటికీ ఫలించలేదు.

ఇదిలా ఉండగా సూదికొండ వద్ద నిర్మించిన హుదూద్ ఇళ్లు నిరుపయోగంగా మారి ఎవరు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. సదరు ఇళ్లు లబ్దిదారులకు కేటాయించకపోవడంతో నిర్వహణ లేక గోడలు బీటలు వారుతున్నాయి. ఇప్పటికే కిటికీల, తలుపులు పగిలి నివసించేందుకు వీలులేకుండా అధ్వాన్నంగా ఉన్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే సామాగ్రి ( ప్యాన్లు, వాటర్ ట్యాంక్లు, పైపులు, తలుపులు) దొంగల పాలైంది. 2020 కరోనా సమయంలో హుదూద్ ఇళ్లను క్వారంటైన్ కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేయడంతో విద్యుత్, మంచినీరు సౌకర్యం కల్పించారు. దాని తరువాత క్వారంటైన్ కేంద్రంను ఎత్తివేయడంతో లక్షలాది రూపాయలు విలువ చేసే సామాగ్రిని అగంతుకులు ఎత్తుకు పోయారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో విషసర్పాలు చేరుతున్నాయి. ఎక్కడ చూసినా మందు బాటిళ్లు, నిరోధ్ లు దర్శనమిస్తున్నాయి.

### ప్రారంభానికి నోచుకోని హుదూద్ ఇళ్లు...

పలాస ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజు గెలిచిన తరువాత వైసీపీ నాయకులు దృష్టి హుదూద్ ఇళ్లపై పడింది. లబ్ధిదారుల పేర్లను సేకరించి జాబితాను తయారు చేశారు. అయినా లబ్ధిదారులకు అందజేయలేకపోయారు. వైసీపీ పాలనలో కూడా హుదూద్ ఇల్లులు ఉత్సవ విగ్రహాల మిగిలాయి. వైసీపీ పాలన కూడా ముగిసిపోయి 2024 సార్వత్రిక ఎన్నికలు కూడా జరిగిపోయాయి. వచ్చే నెల నాలుగున ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. వైసీపీ అభ్యర్థి డా. సీదిరి అప్పలరాజు, టిడిపి అభ్యర్థి గౌతు శిరీషాల మధ్య పోటీ ఆసక్తికరంగా మారడంతో ఎవరు విజేతలవుతారో తెలియక నియోజకవర్గ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వ కాలంలోనైనా హుదూద్ ఇళ్లకు మోక్షం కల్పిస్తుందో వేచి చూడాలి..!

## ఘనంగా శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల నగర సంకీర్తన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని ఎచ్చెర్ల గ్రామంలో శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల 616వ జయంతి మహోత్సవాన్ని గ్రామంలో ఉదయం 6 గంటల నుంచి నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల లో స్వయంభువుగా వెలిసిన శ్రీనివాస ప్రార్థన మందిరం నుండి గ్రామములో స్వామివారి చిత్రపటాలతో తిరువీధి నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్దలు, చిన్నారులు గోవింద నామాలు, అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. జయంతి మహోత్సవంలో భాగంగా శ్రీనివాస ప్రార్థన మందిరం వద్ద సాయంత్రం 6:30 గంటల నుంచి ఏడు గంటల వరకు సప్తగిరి సంకీర్తనలు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు గిన్నిస్ బుక్ లో మూడు సార్లు నమోదు అయిన డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని సిసి బృందం చే అన్నమయ్య పదనారర్తన శోభ అనే కూచిపూడి నృత్యం ప్రదర్శించబడునని ఆలయ వ్యవస్థాపకులు ఆదిమూల వెంకట పతి దాసు తెలిపారు. కార్యక్రమంలోఎస్ వి వి రమణ, మెండ నీలం కుమార్, ధనాలకోటి రమణ, ముని శ్రీనివాస్, బాబురావు, సూరిబాబు, రమేష్, విజయలక్ష్మి, డాక్టర్ నారీమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో భక్తులు

## 25 నుంచి వేంకటేశ్వర స్వామి జాతర

విశాలాంధ్ర-పొందూరు: మండలం తండ్యాం పంచాయితీ పరిధిలోగల మన్నెపేట కొండపై వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆలయ కమిటీ, దుర్గాభవాని కమిటీ సభ్యులు తెలిపారు. 25న ఉత్సవ మూర్తుల తిరువీధి, 26న స్వామి వారి కళ్యాణం, ఇదే రోజున తండ్యాం, శ్రీరాంనగర కాలనీ బృందాలు భజన గీతాలను ఆలాపిస్తాయి. 27న గ్రామ పురోహితులు గన్నవరపు రాంబాబు, నాగేశ్వరశర్మల ఆధ్వర్యంలో ఆరాధన జరుగుతుంది. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తారు. రాత్రి బాణాసంచా కాలుస్తారు. తదనంతరం శ్రీకాకుళం చంద్ర, స్వప్న, రాజు దళం వారిచే "బాలనాగమ్మ" బుర్రకథ ప్రదర్శన ఉంటుంది. భక్తులెల్లరూ ఈ జాతరలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

## గరుడ వాహన తిరువీధిలో శ్రీవారు

గరుడ వాహనంపై తిరువీధిలో పాల్గొన్న శ్రీవారు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గరుడ వాహనంపై తిరువీధిలో పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన ప్రారంభమైన బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాల్లో రోజుకొక వాహనంపై శ్రీవారు తిరువీధి నిర్వహిస్తున్నారు. ఈనెల 27వ తేదీ వరకూ నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం నుండి స్థానిక కంబకాయ జంక్షన్ వరకూ నిర్వహిస్తున్న తిరువీధి కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి దర్శనం చేసుకోవటమే కాకుండా, ప్రధాన కూడల్లో భక్తి శ్రద్ధలతో స్వామివారికి హారతులు ఇస్తున్నారు. గురువారం నిర్వహించిన గరుడ వాహనంపై తిరువీధి కార్యక్రమంలో రాధా మనోహర్ దాస్ స్వామిజీ పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యవరం అగ్రహారం పురోహితులు, మావుడూరు జగదీష్‌శర్మ సోదరులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు, పొట్నూరు చిన వీరభద్రస్వామి, పొట్నూరు కృష్ణప్రసాద్, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అర్చకులు, జోస్యుల జగన్నాధశర్మ, చామర్తి సాయికృష్ణమాచార్యులు, స్వామివారి తిరువీధికి వాహనాలు సమర్పించిన దాతలు, పొట్నూరు వెంకట శ్రీనివాసమూర్తి దంపతులు, పొట్నూరు రత్నయ్య, మోహనరావు దంపతులు, పాగోటి రాజారావు దంపతులు, ముద్దాడ బాలభూపాలనాయుడు దంపతులు, పూణ్ణ కృష్ణ దంపతులు, వైశ్యరాజు వెంకట కృష్ణరాజు దంపతులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి, నరసన్నపేట మండల విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో మెలగాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : విద్యార్థులు ఉన్నత స్థానాలు దక్కించుకునే లక్ష్యంతోనే అడు గులు ముందుకు వేయాలని జె.సి.ఐ నేషనల్ ట్రైనర్ పూసర్ల రజిత అన్నారు. స్థానిక జె.సి.ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని స్థానియ యువతకు స్ఫూర్తి కల్గించేలా పలు అంశాలను వివరించారు. జె.సి.ఐ ఆధ్యక్షులు టి.షణ్ముఖ్, ప్రాజెక్ట్ ఛైర్మన్ వి. రాముల సమన్వయంతో స్థానిక వి.కె.పేట రోడ్డులో నైపుణ్యాభివృద్ధి సూచనలు చేసారు. ఇంటర్వూలకు హాజరైయ్యేటప్పుడు ఎలా వ్యవహరించాలి, విజయాలు సాధించడానికి ప్రణాళికాయుతంగా చేపట్టాల్సిన చర్యలతో పాటు, వ్యవహారశైలి తదితర అంశాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జె.సి.ఐ పూర్వ అధ్యక్షులు గోరు డిల్లేసు, స్వరూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తనావళి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీ తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవ ట్రస్ట్ మరియు శృతి లయ సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమాచార్య 616 వ జయంతి ఉత్సవాల్లో పట్టణానికి చెందిన కాతిల రుక్మిణి, పటాన రాహిత్యలకు ప్రదర్శనకు అవకాశం దక్కింది. తొలి వాగ్గేయకారుడు, పథకవిత పితామహుడు అన్నమయ్యను స్మరించుకుంటూ సంకీర్తన ఇష్టా గోష్ఠి నిర్వహించగా రుక్మిణి, రాహిత్యాలు సంకీర్తనావళితో ఆహుతులను ఆకట్టుకున్నారు. వారికి తోడుగా వయోలిన్‌పై తిప్పన ధనుంజయ, మృదంగంపై వినోద్‌కుమార్, తబలాతో దున్న నారాయణలు తమ కళను ప్రదర్శించి మన్ననలు పొందారు.

## పొన్నూటూరు లో బుద్ధ పౌర్ణమీ వేడుకలు

### గురువులకుపాదపూజ చేసిన ఉత్తమ విద్యార్థులు

విశాలాంధ్ర-కొత్తూరు: మండలం పొన్నూ టూరు గ్రామంలో బుద్ధ పూర్ణిమ 2568వ వేడుకలు ఘనంగా జరిగాయి. రామరాజు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పారిసిల్లి రామరాజు ఆధ్వర్యంలో. జరిగిన బుద్ధ పూర్ణిమ వేడుకల్లో ఉత్తమ విద్యార్థులు. జన్ని దేవీ శ్రీ ,అంద వరపు జయసాయి తమ గురువులు, తల్లితండ్రులకు పాద పూజ చేసారు ఈ కార్యక్రమంలో హెచ్చి.ఎం.కృష్ణారావు సర్పంచ్ ఎద్దు చామంతి, బలగా అప్పారావు ,వై. సంతోష్ తదితరలు పాల్గొన్నారు.